క్లుప్తంగా

కలెక్టర్, ఎస్పీలకు ఆహ్వానం



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: ఈ నెల 6న పట్టణ శివార్లోని కొనకొండ్ల రోడ్డులో ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.భీమిరెడ్డి విగ్రహావిష్కరణ, భీమా పార్క్‌ల ప్రారంభోత్సవానికి హాజరు కావాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్పను మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో వారిరువురిని నైరుతిరెడ్డి కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

యల్లనూరు: పుట్లూరు మండలం కోమటికుంట్ల 33 కేవీలైను మరమ్మతులో భాగంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

పామిడి: సొరకాయలపేట గ్రామ పులి కనుమ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివారల మేరకు..రామగిరి గ్రామానికి చెందిన సురేష్ బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. వజ్రకరూరు నుంచి పామిడి వైపునకు వెళ్తున్న పాల ఆటో బైక్‌ను ఢీకొంది. ఘటనలో సురేష్‌కు కుడికాలు, చేయి విరిగింది. అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వీఆర్ఓకు సన్మానం

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన వీఆర్ఓ తలారి వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, డీటీ హాజీవలి, రీసర్వే డీటీ శ్రీలత వెంకటేశ్వర్లును పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఆర్ఐ సందీప్, వీఆర్ఓలు నాగరాజు, కిశోర్, శివారెడ్డి, నాగరత్న, పవిత్ర పాల్గొన్నారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా రమణనాయక్



శింగనమల: స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ రమణనాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న డాక్టర్.రోషన్‌సాబ్ అనంతపురం సర్వజనాస్పత్రికి బదిలీ అయ్యారు. దీంతో ఇక్కడ జనరల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్.రమణనాయక్‌కు సూపరింటెండెంట్‌గా నియమించారు. డాక్టర్.రమణనాయక్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యం అందిస్తామన్నారు.

ఘనంగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరా

పామిడి: ఓబుళాపురం గ్రామంలో శుక్రవారం పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించారు. వైస్ ఎంపీపీ కాయల మహేష్, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ దాసరి కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి లక్ష్మీనారాయణ, ధను, నల్లప్ప, దేవరపల్లివాసులు రామాంజనేయులు, పామిరెడ్డి, సూరి, వెంకటేష్, రంగనాథ్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదో రోజు రంగనాథుడు గరుడవాహనంపై ఊరేగాడు. శ్రీదేవి, భూదేవి సహిత ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై శివారులోని జమ్మిచెట్టు వరకు ఊరేగించారు. ఈఓ దేవదాసు, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు.

సీహెచ్ఓపై విచారణ

గార్లదిన్నె: స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా గతంలో పని చేసిన నాగరాజుపై మహిళా ఉద్యోగుల వేధింపుల ఆరోపణ విషయమై శుక్రవారం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్ విచారణ చేపట్టారు. సందర్భంగా ఆయన అప్పట్లో పనిచేసిన బాధిత మహిళ ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ ఉద్యోగులతో వివరాలు సేకరించారు. ఆరోపణలకు సంబంధించి విషయాలను రాతపూర్వకంగా విచారణాధికారికి అందజేశారు. పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్

పెద్దవడుగూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాంపురం నుంచి ప్రజా సంక్షేమ యాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా యాత్ర మొళకతాళ్ల గ్రామం మీదుగా చిత్రచేడు చేరుకుది. యాత్రకు ఎమ్మెల్సీలు వెన్నపూస గోపాల్‌రెడ్డి, వై.శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మాజీ సమన్వయకర్త వీఆర్.రామిరెడ్డి, గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, వీఆర్ వెంకటేశ్వరరెడ్డి, పామిడి ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. చిత్రచేడు గ్రామానికి యాత్ర చేరుకోవడం తో జెడ్పీహైస్కూల్ విద్యార్థులు రోడ్డుపైకి చేరుకుని పూలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పథకాలను ఎమ్మెల్యే వివరించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా నవరత్నాల పేరుతో ప్రవేశ పెట్టిన ప్రతి పథకం ప్రజలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వర్షాలు బాగా కురుస్తున్నాయని, ఆయకట్టుకు రెండు పంటలకు నీరు ఇస్తున్నామన్నారు. ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే వారిని ఎన్నుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గూడూరు సూర్యనారాయణరెడ్డి, మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం కన్వీనర్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రఘునాథరెడ్డి, అనంతపురం పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ రఘునాథరెడ్డి, నాయకులు రవీంద్రారెడ్డి, రంగారెడ్డి, రామాంజినేయులు, నాగేంద్ర, నస్సీరు, మొళకతాళ్ల సురేష్, రామచంద్రారెడ్డి, సుబ్బరాయుడు, రమేష్ రాజశేఖర్, రవీంద్ర, రాజు, ధనాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి



ఈ-క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ ముస్తాక్

గుత్తి రూరల్: రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలకు తప్పకుండా ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ ముస్తాక్ అహ్మద్ సూచించారు. శుక్రవారం తురకపల్లి గ్రామంలో ఈ–క్రాప్ బుకింగ్ నమోదును ఏఓ పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ ముస్తాక్ మాట్లాడుతూ రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకొని పంటలు నమోదు చేయించుకుంటేనే క్రాప్ ఇన్సూరెన్సు, పీఎం కిసాన్, రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటనష్ట పరిహారం, సున్నా వడ్డీ రుణాలు తదితర పథకాలు వర్తిస్తాయన్నారు. కౌలు రైతులను గుర్తించి వారికి సాగు హక్కు పత్రాలను మంజూరు చేయించాలని ఆర్‌బీకే సిబ్బందికి ఏఓ ఆదేశించారు. జీవన రేఖ హెల్ప్‌లైన్ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ మానస, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



నీటితొట్టెను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి, వైద్యులు

యల్లనూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా ధికారి ఓబులు ప్రజలకు సూచించారు. గురువారం యల్లనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో ల్యాబ్, ఓపీ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆరో వార్డులో పర్యటించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వారానికి ఒక రోజు డ్రై డే పాటించాలన్నారు. నీటి తొట్టెల్లోని నీటిని పారబోయించారు. దోమలతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, వైద్యాధికారి శివసాయి, సీహెచ్ఓ మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ఉద్యోగులందరూ ఐకమత్యంతో పోరాడితే సమస్యలు పరిష్కరించుకోవచ్చని ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వైకేపీ కార్యాలయంలో తాలుకా అధ్యక్షుడు అక్కులప్ప అధ్యక్షతన ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ శింగనమల తాలుకా కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు జిల్లా కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలపై పోరాటాలకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యక్షులు రవి కుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు జమీలా, రాష్ట్ర ఉపాధ్యక్షులు జక్కుల మాధవ, నగర కార్యదర్శి శ్రీధర్‌బాబు, శ్రీనివాసులు, మండల వైద్యాధికారి డాక్టర్ స్వాతి లక్ష్మి, సీహెచ్ఓ మోహన్‌రావు, కిరణ్‌కుమార్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలే రియల్ హీరోలు

గుంతకల్లు: ప్రమాద సమయంలో క్షతగాత్రులకు రక్తదానం చేసిన వారే రియల్ హీరోలని సబ్ రిజిస్ట్రార్ షమీర్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని ఎంసీఏ, ఎంబీఏ కళాశాలలో జేవీవీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానంపై అపోహలు వీడాలన్నారు. సకాలంలో రక్తం దొరక్క ఎంతో మృత్యువాతకు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థుల నుంచి సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంకు అందజేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ హరిప్రసాద్‌యాదవ్, కళాశాల కరస్పాండెంట్ ఓంకార్, ప్రిన్సిపాల్ హనుమాన్ ప్రసాద్, లాయర్ చంద్రశేఖర్, బ్లడ్ బ్యాంకు వైద్యుడు వంశీకృష్ణా ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో వ్యవసాయాభివృద్ధి



కౌలుదారులకు సాగు హక్కు పత్రాలను అందజేస్తున్న ఏడీ లీనా వసుంధర

పామిడి: రైతు భరోసా కేంద్రాలు వ్యవసాయాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయని ఏడీ లీనా వసుంధర అన్నారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి అడ్వయిజరీ బోర్డు సభ్యుల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసంప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ, పీఎం కిసాన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కౌలు రైతులకు వారి పంటల సాగు హక్కుపత్రాలను అందజేశారు. ఏఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీ అవిష్కరిస్తున్న రైల్వే డీజీ కుమార్ విశ్వజిత్

గుంతకల్లు: జీఆర్‌పీ పోలీసు డైరీని రైల్వే డీజీ కుమార్ విశ్వజిత్ ఆవిష్కరించినట్లు ఏపీ స్టేట్ పోలీసుల సంఘం వైస్ ప్రెసిడెంట్ వి.జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గుంతకల్లు జీఆర్‌పీ ఎస్పీ కే.చౌడేశ్వరీ సహకారంతో డైరీని శుక్రవారం విజయవాడలోని డీజీ కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించినట్లు ఆయన వివరించారు. ఏపీ స్టేట్ పోలీసుల సంఘం అధ్యక్షుడు జనకుల శ్రీనివాస్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అక్కిరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

గుంతకల్లుటౌన్: పట్టణంలో శుక్రవారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసులు కవాతు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వందమంది ఆర్ఏఎఫ్ సిబ్బంది స్థానిక బీరప్పగుడి సర్కిల్ నుండి రైల్వే గ్రౌండ్ వరకు కవాతు చేశారు. అనంతరం ఆర్ఏఎఫ్ విధులు, బాధ్యతలు, వినియోగించే ఆయుధాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీఎస్పీ నరసింగప్ప, ఆర్ఏఎఫ్ అధికారి వినోద్, సీఐలు రామసుబ్బయ్య, గణేష్, ఎస్ఐలు మురారి, సురేష్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

తాడిపత్రి టౌన్ : స్థానిక రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు శుక్రవారం సాయంత్రం విస్తృత తనిఖీలు చేపట్టారు. జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, ఆర్పీఎఫ్ ఎస్ఐ లింగమయ్య రైల్వే స్టేషన్‌కు చేరుకుని డాగ్ స్క్వాడ్‌తో క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రైళ్లల్లో నేరాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ నాగప్ప పేర్కొన్నారు.

డీలర్ పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

గార్లదిన్నె: గుడ్డాలపల్లిలో ఖాళీగా ఉన్న రేషన్ షాపు డీలర్ పోస్టుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తహసీల్దార్ ఉషారాణి శుక్రవారం తెలిపారు. డీలర్ పోస్టు బీసీ-సీ అభ్యర్థులకు రిజర్వేషన్ చేశారన్నారు. ఇంటర్ పూర్తి చేసి, పంచాయతీ పరిధిలో నివాసం ఉన్న 18 నుంచి 40 ఏళ్లలోపు వయస్సు ఉన్నవారు అర్హులన్నారు. దివ్యాంగులయితే మండలంలో నివాసం ఉండాలన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల11 లోపు ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మాతాశిశు మరణాలు అరికడదాం

నార్పల: మండల వ్యాప్తంగా మాతా,శిశు మరణాలను అరికడదామని తహసీల్దార్ నారాయణస్వామి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అంగన్‌వాడీలు, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మాతా,శిశు మరణాల రేటు తగ్గేలా అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల్లో రక్తహీనత నివారణ, పిల్లలలో వయస్సుకు తగ్గ బరువు, ఎత్తు ఉండేలా చూడాలన్నారు. ఈఓఆర్డీ లక్ష్మీనరసింహ, ఏఎస్ఓ క్రిష్ణయ్య, డాక్టర్లు రవీంద్ర, ప్రవీణ్ కుమార్, అంగన్వాడీ సూపర్‌వైజర్లు శ్రీవాణి, ఉమాదేవి పాల్గొన్నారు.

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోండి

యల్లనూరు: ప్రతి ఒక్కరూ ఓటరుకార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బీఎల్‌వోల సందేహాలను నివృత్తి చేశారు. ఓటరుకార్డుకు ఆధార్‌కార్డును అనుసంధానాన్ని 100 శాతాన్ని పూర్తి చేయాలన్నారు. ఈఓఆర్డీ విజయశేఖర్‌నాయుడు, బీఎల్‌వోలు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విశ్వనాథుడికి నివాళి

తాడిపత్రి టౌన్ : స్థానిక గాంధీ కట్ట సమీపంలోని సరస్వతి విద్యామందిరంలో శుక్రవారం సాయంత్రం కళాతపస్వి డాక్టర్ కాశీనాథుని విశ్వనాథ్ చిత్రపటానికి ఘంటసాల గానసభ సభ్యులు, విశ్వనాథ్ అభిమానులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ఘంటశాల గానసభ సభ్యులు మహేష్‌స్వామి, రామకృష్ణ, బాల సుబ్రమణ్యం, శారధ, భూమా నాగరాగిణి, శ్రీనివాసరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

గుత్తి రూరల్: టి.కొత్తపల్లి గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన పెద్దిరాజు బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. శుక్రవారం గుత్తికి బైక్‌లో వస్తుండగా గ్రామ శివారులో తాడిపత్రి వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ పెద్దిరాజును గుత్తి ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి అన్యాయం

తాడిపత్రి టౌన్ : కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో చేనేత రంగానికి అన్యాయం చేసిందని జాతీయ చేనేత ఐక్య వేదక రాష్ట్ర అధ్యక్షుడు రుషింగప్ప ఆరోపించారు. స్థానిక అంబా భవాని ఆలయంలో శుక్రవారం చేనేత కార్మికుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.200 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం కేవలం రూ.156 కోట్లు కేటాయించడం దారుణమన్నారు. ఏపీలో చేనేత రంగం అభివృద్ధికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేదిక జిల్లా అధ్యక్షుడు జగన్నాథ్, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు గోవిందరావు, నియోజకవర్గ అధ్యక్షుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పునర్వసు పూజలు

గుంతకల్లు రూరల్: పునర్వసు తిరునక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో శుక్రవారం పునర్వసు పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ యాగశాలలో సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి వార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి తిరుమంజన స్నపనం నిర్వహించారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ప్రజల మేలు కోసం మళ్లీ జగనన్నే రావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: రాష్ట్ర ప్రజల మేలు కోసం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మార్కెట్‌యార్డులో మండలంతో పాటు పట్టణంలోని 3 నుంచి 16 వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు నిత్యం ప్రజల్లో తిరుగుతూ గడిచిన మూడున్నరేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు.

ఎన్టీఆర్‌ని వెన్నుపోటు పొడిచిన పాపం ఊరికేపోదు

ఎన్టీఆర్‌ను అధికారం కోసం కట్టప్పలాగా వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఎన్టీఆర్‌ని మానసిక క్షోభకు గురిచేసి ఆయన మరణానికి కారకుడైన చంద్రబాబుకు దేవుడు అనేక శాపాలు పెట్టాడన్నారు. నారా లోకేష్ చంద్రబాబు పాలిట శాపంగా మారాడన్నారు. లోకేష్ పాదయాత్రలో వందమంది కూడా వెంట లేరంటే ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణ ఎలాంటిదో తెలుస్తుందన్నారు. ఎవరెన్ని జాకీలు పెట్టి లేపినా, చంద్రబాబు, దత్తపుత్రులు ఎంతమంది కలిసినా టీడీపీ అధికారంలోకి వచ్చేది లేదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్, ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు సుంకప్ప, మోహన్ రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌వీఆర్.మోహన్, వైస్ చైర్మన్ పాండురంగారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సుంకిరెడ్డి, వార్డు సచివాలయాల పట్టణ కన్వీనర్లు జింకల రామాంజి, ఎండీ.ఖలీల్, మండల కన్వీనర్ గోవింద్‌నాయక్, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పి.వలి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, కోఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి



యాడికి సొసైటీ అధ్యక్షుడు కొట్టే వెంకటరామిరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం

యాడికి: యాడికి సొసైటీ పరిధిలోని రైతులందరూ మార్చి ఆఖరు లోపు పంట రుణాలు రెన్యువల్ చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు కొట్టే వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పాత పోలీస్‌స్టేషన్ వద్ద సొసైటీ కార్యాలయంలో బ్యాంకు 105 వార్షికోత్సవం సందర్భంగా బ్యాంకు మేనేజరు దీపిక, సిబ్బందితో కలిసి ఆయన కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకుడు ఆదిమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొట్టే వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రెన్యువల్ కోసం వచ్చే రైతులు 1బి, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 4 ఫొటోలు, పాసు పుస్తకం జిరాక్స్ తీసుకురావాలన్నారు. బ్యాంకు మేనేజరు, దీపిక, సిబ్బంది వెంకటరామిరెడ్డిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏడీసీసీ బ్యాంకు దినోత్సవం

గుంతకల్లు రూరల్: పట్టణంలోని సహకార బ్యాంకులో శుక్రవారం బ్యాంకు ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ సుంకిరెడ్డి, బ్యాంకు మేనేజర్ పుల్లయ్య బ్యాంకు వ్యవస్థాపకులు పీ.ఆదిమూర్తి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బ్యాంకు ద్వారా రైతులకు అందించే సేవలను వివరించారు.

తాడిపత్రి టౌన్ : స్థానిక సంజీవనగర్‌లోని ఏడీసీసీ బ్యాంకులో శుక్రవారం బ్యాంకు ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ప్రవేశ పెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ ఎంయల్ఎస్ మూర్తి ప్రజలను కోరారు. వ్యవసాయ, ఇతర రుణాలను ఈనెల 27లోపు రెన్యూవల్ చేయాలని లబ్ధిదారులను కోరారు. సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌లు, సీఈఓలు బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టును సామాజిక సమస్యగా చూడాలి



కరిడికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి రూరల్: కుష్టును సామాజిక సమస్యగా చూడాలని బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి దేవేంద్ర నాయక్ అన్నారు. శుక్రవారం కరిడికొండ ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామస్తులకు కుష్టుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దేవేంద్రనాయక్ మాట్లాడుతూ జాతిపిత మహాత్మ గాంధీ కుష్టు బాధితులకు చేసిన సేవలకు జ్ఞాపకార్థకంగా జనవరి 30 నుంచి ఈ నెల 13 వరకూ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. శరీరంపై స్పర్శ లేకుండా, రాగి రంగులో మచ్చలు ఉంటే స్థానిక ఆరోగ్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వైద్య సిబ్బంది లక్ష్మీదేవి, సోనాబాయి, రామకృష్ణ, ఓబుళమ్మ, ఆశా కార్యకర్తలు మహాలక్ష్మి, రామలక్ష్మి పాల్గొన్నారు.

యాడికి: నగరూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం కుష్టుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీపీఎంఓ రామచంద్ర మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని రాగి రంగు మచ్చలు, అర చేతులు, అరకాళ్లలో కండరాల బలహీనత, కను ఎగువ రెప్పలు బలహీనంగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంతకుముసుపు గ్రామంలో ఉన్నత పాఠశాల విద్యార్థుల కుష్టు నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం మార్కస్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

గుంతకల్లు రూరల్: మండలంలో 2021-22లో జరిగిన ఉపాధి హామీ పనులపై శుక్రవారం నుంచి సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఎంపీడీఓ జాషువా మాట్లాడుతూ శుక్రవారం నుంచి ఈనెల 12 వరకూ తనిఖీలతో పాటు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు పాతకొత్తచెరువు గ్రామంలో తనిఖీలు చేపట్టామన్నారు. ఈనెల 3, 4న పాతకొత్తచెరువు, దంచర్ల, వైటీ.చెరువు, గుండాల తండా, కసాపురం, 3, 5 తేదీల్లో నక్కనదొడ్డి, 5,6 తేదీల్లో నెలగొండ, పులగుట్టపల్లి, పులగుట్టపల్లి పెద్దతండా, 6,7 తేదీల్లో గుర్రబ్బాడు, నాగసముద్రం, గుండాల, జి.కొట్టాల 8, 9 తేదీల్లో నల్లదాసరపల్లి, తిమ్మాపురం, అయ్యవారుపల్లి, చింతలాంపల్లి, కొంగనపల్లి, 9,10 తేదీల్లో ఓబుళాపురం, 10, 11 తేదీల్లో కదిరిపల్లి, దోసలుడికి, ఇమాంపురం, వెంకటాంపల్లి, 11,12 తేదీల్లో మొలకలపెంట గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 13న ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక(బహిరంగసభ) ఉంటుందని వివరించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని ఎస్సీ కాలనీకి చెందిన యశ్వంత్ అనే యువకుడు శుక్రవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తాను ప్రేమించిన అమ్మాయి కుటుంబ సభ్యులు, బంధువులు వేధింపులతో ఆత్మహత్యకు యత్నించినట్లు బాధితుడు పోలీసులకు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా యశ్వంత్ బాబు తనను ప్రేమించి మోసం చేశాడని చెట్నేపల్లికి చెందిన ఓ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తానూ, యశ్వంత్ బాబు ఆరేళ్లుగా ప్రేమించుకున్నామని, పెళ్లి ప్రస్తావన తేవడంతో దూరంగా ఉంటున్నాడని ఫిర్యాదులో పేర్కొంది.